ఈనాడు
రాజన్న సిరిసిల్ల
బుధవారం అక్టోబరు 16, 2024


# భూమిపూజతోనే సరిపెట్టారు

న్యూస్‌టుడే, వేములవాడ

అధికారుల అలసత్వం, ప్రజా ప్రతినిధుల నిర్లక్ష్యం వెరసి నిధులున్నా వంతెన నిర్మాణం భూమిపూజకే పరిమితమైంది. వేములవాడ పట్టణంలోని మల్లారం రోడ్డులో కట్టుకాలువ వద్ద ఏటా భారీ వర్షాలకు వరద ప్రవాహం కారణంగా ఈ ప్రాంత గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో కాలువపై పైవంతెన నిర్మాణానికి ప్రతిపాదన చేశారు. దాదాపు రూ.2.5 కోట్లు మంజూరు కాగా అప్పటి ఎమ్మెల్యే సీహెచ్.రమేశ్‌బాబు దాదాపు ఏడాదిన్నర క్రితం భూమిపూజ చేశారు. దీంతో వంతెన నిర్మాణం పూర్తయి తమ కష్టాలు తీరుతాయని ఈ ప్రాంత గ్రామాల ప్రజలు ఆశ పడ్డారు. అయితే పనులు మొదలు కాకపోవడంతో ఈ ప్రాంతీయుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమవుతుంది.

### వాగు పారితే రాకపోకలు బంద్

☛ వేములవాడ పట్టణ శివారు మల్లారం రోడ్డులోని కట్టుకాలువ వర్షాకాలంలో ఉద్ధృతంగా పారితే ఈ ప్రాంతం వైపు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఏటా వర్షాకాలంలో ఇదే తంతు జరుగుతున్నా అధికారులు పనులు మొదలు పెట్టకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

☛ భారీ వర్షం కురిస్తే భీమేశ్వరకాలువ నీటితో పాటు వ్యవసాయ క్షేత్రాల నుంచి నీరు భారీగా ఈ కాలువలో చేరుతుంది. దీంతో ఈ కల్వర్టు వద్ద వరద ప్రవాహం వల్ల రవాణా స్తంభించిపోతుంది.

☛ కల్వర్టు అవతలి వైపు ఉన్న జయవరం, మల్లారం, హన్మాజీపేట, బొల్లారం, లింగంపల్లి, గ్రామాలతో పాటు కోనరావుపేట మండలంలోని మామిడిపల్లి వైపు వెళ్లే గ్రామాల ప్రజలు, మరో వైపు చందుర్తి మండలంలోని ఎన్గల్, బండపల్లి వైపు వెళ్లే గ్రామాలకు రాకపోకలు నిలిచి పోతున్నాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వేములవాడ, సిరిసిల్ల పట్టణాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

☛ ఈ మార్గం మీదుగా నిజామాబాద్ జిల్లా సిరికొండ వరకు రవాణా సౌకర్యం నిలిచిపోతుంది. ఇంతటి ప్రాధాన్యం ఉన్న ఈ వంతెన నిర్మాణం పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోకపోవడం పట్ల ఈ ప్రాంత గ్రామాల ప్రజల నుంచి నిరసన వ్యక్తమవుతుంది.

### నిధులున్నా పైవంతెన నిర్మాణంలో నిర్లక్ష్యం


మల్లారం రోడ్డులో పైవంతెన నిర్మించాల్సిన ప్రదేశం

### వర్షాకాలం ఇబ్బందులు పడుతున్నాం



కాలువ పారితే మా గ్రామంతో పాటు ఇటు వైపు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతుంటాయి. దీంతో దాదాపు ఐదారు గ్రామాల ప్రజలు వేములవాడ వెళ్లడానికి ఇబ్బందులు పడాల్సి వస్తుంది. పై వంతెన నిర్మిస్తే ఈ ప్రాంత గ్రామాల ప్రజల ఇబ్బందులు తొలగిపోతాయి. **- ఎంద్రాల కిరణ్, జయవరం**

### పనులు మొదలు పెడతాం



గుత్తేదారు కొన్ని కారణాల వల్ల పై వంతెన నిర్మాణ పనులు ప్రారంభించలేదు. దీంతో జాప్యం నెలకొంది. ముందుగా కల్వర్టు వద్ద డైవర్షన్ రోడ్డు నిర్మించి త్వరలో పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటాం. **- శాంతయ్య, డీఈఈ, ఆర్‌అండ్‌బీ, వేములవాడ**

# అభివృద్ధిని కొనసాగిస్తాం

- నవంబరులో ముఖ్యమంత్రి పర్యటన
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

**సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే:** గత ప్రభుత్వాలు పాటించిన ఆర్థిక విధానాల వల్ల ప్రస్తుతం రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ ప్రభుత్వం ప్రజల సంక్షేమం, అభివృద్ధిని కొనసాగిస్తుందని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశమందిరంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాలతో కలిసి గౌడ వర్గీయులకు కాటమయ్య రక్షక కవచ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ సిరిసిల్ల నియోజకవర్గంలో 200 మంది గీత కార్మికులకు ఈ కిట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈత, తాటి చెట్లు ఎక్కి ప్రమాదాల వల్ల వైకల్యం పొందడం, ప్రాణాలు కోల్పోవడం జరుగుతుందన్నారు. ఈ ప్రమాదాలను నివారించేందుకు సాంకేతికంగా కిట్‌ను తయారు చేసి పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే నెలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జిల్లాలో పర్యటించే అవకాశం ఉందని తెలిపారు. గీత కార్మికులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రభుత్వ భూముల్లో సామూహికంగా పెద్ద ఎత్తున ఈత చెట్లు పెంచే అవకాశాలను పరిశీలించి ఆ దిశగా చర్యలు చేపడతామన్నారు. కాలువలకు ఇరువైపుల ఈత చెట్లు నాటేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఈత, తాటి చెట్లను పెంచాలని సూచించారు. కలెక్టర్ మాట్లాడుతూ రక్షక కవచ కిట్ వినియోగంపై శిక్షణ ఇచ్చామని తెలిపారు. దీనిని కార్మికులు తప్పనిసరిగా ఉపయోగించి, ప్రమాదాల నుంచి రక్షణ పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ నాగుల సత్యనారాయణగౌడ్, సిరిసిల్ల మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ స్వరూప రాణి, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, బీసీ సంక్షేమశాఖ అధికారి రాజమనోహర్, జిల్లా ఆబ్కారి అధికారి పంచాక్షరి, ప్రజా ప్రతినిధులు, గౌడ వర్గీయులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న విప్ ఆది శ్రీనివాస్

# ముందుకు కదలని మురుగు

## కాలువల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్ వ్యర్థాలు

న్యూస్‌టుడే, సిరిసిల్ల అర్బన్

సిరిసిల్ల పురపాలక సంఘంలో ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. చెరువులు, కుంటలు, కాల్వలు, నాలాల్లో పోగవుతున్నాయి. వీటికి చెత్తాచెదారం తోడు కావడంతో ఎక్కడి మురుగు అక్కడే నిల్వ ఉంటుంది. గుట్టలుగా పేరుకుపోవడంతో నీటి ప్రవాహం ఆగిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలకు నిలయంగా మారుతున్నాయి. ఇటు పర్యావరణానికి ముప్పు తెస్తున్నాయి. ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నిషేధించినా ఎక్కడా అమలు కావడం లేదు. మరోవైపు పురపాలక సంఘం అధికారులు ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్తాచెదారం సేకరణకు ఉదయం, సాయంత్రం సమయంలో వాహనాలను ఇంటి ముందుకే పంపిస్తున్నా ప్రజలు వాటిలో వేయకుండా ఇష్టానుసారంగా వేస్తున్నారు. దీనితో మురుగు కాలువ సమీపంలో ఉన్న నివాస ప్రాంతాల వారికి ఈగలు, దోమల బెడద పెరిగి వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు చేపడితేనే దీనికి అడ్డుకట్ట పడుతుంది. లేకుంటే సమస్య యథావిధిగా కొనసాగుతుంది.


పాత బస్టాండ్ ఎదుట కాలువలో చెత్తాచెదారం తొలగిస్తున్న కార్మికులు

- పట్టణంలో వార్డులు: 39
- గృహాల సంఖ్య: 33,008
- సిరిసిల్ల పట్టణ జనాభా: 1,16,938
- పారిశుద్ధ్య కార్మికులు: 251
- చెత్త వాహనాలు: 27
- ట్రాక్టర్లు: 18
- ఆటోలు: 9
- ప్రధాన వరద కాలువలు: 2

★ ఒకటి సాయినగర్ నుంచి శాంతినగర్ వరకు దాదాపు ఆరు కిలో మీటర్లు ఉంటుంది.
★ రెండోది గణేశ్‌నగర్ నుంచి పద్మనగర్ వరకు దాదాపు నాలుగు కిలో మీటర్లు ఉంటుంది.




శాంతినగర్ కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు

### దోమ కాటుకు గురవుతున్నాం



పట్టణ ప్రజలు రోజూ చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలను వాహనాలకు ఇవ్వకుండా ప్రధాన మురుగు కాలువలతోపాటు వరద కాలువలు, నాలాలు, ఉదరు కాలువలో వేస్తున్నారు. వాటిని తొలగిస్తుంటాం. దోమ కాటుకు గురై ప్రైవేటు ఆసుపత్రిలో చేరి ఆర్థికంగా నష్టపోతున్నాం. **- బాలయ్య, పారిశుద్ధ్య కార్మికుడు**

### జరిమానా విధిస్తాం

పట్టణ ప్రజలు కాలువలు, నాలాల్లో చెత్తాచెదారం వేస్తే రూ.500 నుంచి రూ.1000 వరకు జరిమానా విధిస్తాం. పట్టణవాసులు పురపాలక సంఘానికి సహకరిస్తే పట్టణాన్ని దోమలు లేని నగరంగా తీర్చిదిద్దుతాం.

**- సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

# ఉన్నత చదువుకు బకాయిల భారం



- పెండింగ్‌లో రూ.120 కోట్ల ఆర్టీఎఫ్ నిధులు
- ప్రైవేటు కళాశాలలు మూసి యాజమాన్యాల నిరసన

**పేద పిల్లలు ఉన్నత విద్యకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం సమకూరుస్తున్న ఆర్థిక సాయం నిలిచిపోయింది.. విద్యాసంవత్సరం సగం మేర పూర్తయినా బకాయిలు రాకపోవడంతో యాజమాన్యాలు కళాశాలలు మూసి నిరసన తెలుపుతుండగా, ప్రభుత్వ నిర్లక్ష్యం తమ భవిష్యత్తుకు ప్రతిబంధకంగా మారిందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు..**

ఈనాడు, కరీంనగర్

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడేళ్లుగా ప్రైవేటు డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ కళాశాలల ఖాతాలకు చేరాల్సిన ఆర్టీఎఫ్(రీయింబర్స్‌మెంట్ ట్యూషన్ ఫీ) నిధులు పేరుకుపోయాయి. నిర్వహణ భారంగా మారిందని యాజమాన్యాలు కళాశాలలు మూసి నిరసన తెలుపుతుండటంతో దసరా సెలవుల తరువాత విద్యార్థులు ఇళ్ల వద్దే ఉండిపోవాల్సిన పరిస్థితి నెలకొంది.

- నాలుగు జిల్లాల పరిధిలో 64 డిగ్రీ, 35 పీజీ కళాశాలలతో పాటు 8 ఇంజినీరింగ్, 15 వరకు ఎంబీఏ, ఎంసీఏ కళాశాలలున్నాయి. అన్ని చోట్లా కలిపి దాదాపు 42 వేల మంది విద్యార్థులు చదువుతున్నారు.
- డిగ్రీ స్థాయిలో రూ.20 వేలు, ఇంజినీరింగ్ తదితర కోర్సులకు రూ.27 వేల వరకు ప్రభుత్వం ఆర్టీఎఫ్‌ను చెల్లిస్తోంది.
- కొన్ని కోర్సులు మినహాయించి దాదాపు డిగ్రీ విద్యార్థుల ఫీజు మొత్తం రీయింబర్స్‌మెంట్ ద్వారానే యాజమాన్యాలకు అందుతోంది.
- దాదాపు 95 శాతం మంది విద్యార్థులు ప్రభుత్వం చెల్లించే రుసుంతోనే చదువు పూర్తి చేస్తున్నారు.

మూడేళ్లుగా చెల్లింపులు లేక నాలుగు జిల్లాల్లో కలిపి రూ.120 కోట్ల వరకు బకాయిలున్నాయి.

- 2021-22కు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌లో 30 శాతం, 2022-23కు సంబంధించి 90 శాతం బకాయిలున్నాయి. గత విద్యా సంవత్సరం(2023-24)లో ఒక్క పైసా విడుదల కాలేదు.
- ప్రస్తుత విద్యా సంవత్సరం విషయంలో అతిగతీ లేకపోగా తెలంగాణ అఫ్లియేటెడ్ డిగ్రీ, పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్(టీపీడీపీఎంఏ) ఆధ్వర్యంలో పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించారు.
- స్పందన లేకపోవడంతో శాతవాహన విశ్వవిద్యాలయ పరిధిలోని ప్రైవేటు కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఎస్‌యూపీఎంఏ) ఆధ్వర్యంలో బంద్ నోటీసు అందించారు. రెండు రోజులుగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి.


జమ్మికుంట చాణక్య డిగ్రీ, పీజీ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు

### ఉపకార వేతనాలదీ అదే పరిస్థితి

కొన్ని కోర్సులకు సంబంధించి విద్యార్థులు ఆర్టీఎఫ్ పోగా మిగతా ఫీజును చెల్లిస్తామనే ఒప్పందంతో కళాశాలల్లో చేరుతున్నారు. ఉపకార వేతనాలు మంజూరైతే మిగతా ఫీజును చెల్లిద్దామనుకున్నా రెండేళ్లుగా ఎంటీఎఫ్ (మెయింటెనెన్స్ ఫీ టు స్టూడెంట్) సక్రమంగా అందడం లేదు. చదువు పూర్తయినా ప్రభుత్వం నుంచి కళాశాల యాజమాన్యాలకు ఆర్టీఎఫ్ రాకపోవడంతో టీసీ, మార్కుల జాబితా తదితర ధ్రువపత్రాలు తీసుకునే సమయంలో విద్యార్థులు ఫీజు చెల్లించాల్సి వస్తోంది. చాలా కళాశాలల్లో డిగ్రీ విద్యార్థులు ఉపకార వేతనం మొత్తాన్ని కళాశాలకు చెందిన ప్రైవేటు బస్సు రవాణాకు ఉపయోగిస్తున్నారు. అది కూడా రాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో కళాశాలలో ఆర్టీఎఫ్ బకాయిలు తృతీయ సంవత్సరం వరకు అలాగే కొనసాగుతున్నాయి.

### తరగతులు నష్టపోతున్నాం



ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాలేదని కళాశాలలు మూసివేయడంతో మేం నష్టపోవాల్సి వస్తోంది. ఉపకార వేతనాలు వస్తే అవసరమైన విద్యా సామగ్రిని కొనుక్కునే వాళ్లం. నాకు గతేడాదితో పాటు ఈ సంవత్సరానికి చెందిన ఉపకార వేతనం అందలేదు.

**-బి.నవ్యశ్రీ, బీకాం ద్వితీయ సంవత్సరం, కరీంనగర్**

### వేతనాలు చెల్లించలేకపోతున్నాం



కొన్నేళ్లుగా బకాయిలు రాక కళాశాలలు నడపలేని పరిస్థితిలో ఉన్నాం. సిబ్బందికి వేతనాలు సహా నిర్వహణ తలకు మించిన భారంగా మారింది. అప్పు చేసి తరగతులు నిర్వహించాల్సి వస్తోంది. ఇప్పటికైనా ప్రభుత్వం బకాయిలను సత్వరమే చెల్లించి విద్యా ప్రగతికి తోడ్పాటునందించాలి.

**-శ్రీపాద నరేశ్, కార్యదర్శి, ఎస్‌యూపీఎంఏ, జగిత్యాల**

# రహదారి నిర్వాసితులకు న్యాయం చేస్తాం


మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్, వేదికపై మున్సిపల్ ఛైర్‌పర్సన్ మాధవి, తదితరులు

**వేములవాడ, న్యూస్‌టుడే:** వేములవాడ పట్టణంలోని రాజన్న ఆలయం ముందు ప్రధాన రహదారి విస్తరణకు వ్యాపారులు సహకరించాలని, నిర్వాసితులకు పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్ తెలిపారు. మంగళవారం వేములవాడ మున్సిపల్ కార్యాలయంలో రహదారి వెడల్పులో దుకాణాలు, ఇళ్లు కోల్పోతున్న వారితో ఆర్డీవో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. రహదారి విస్తరణ పనులు చేపట్టవద్దని, దీంతో తాము దుకాణాలు కోల్పోయి రోడ్డున పడతామని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ప్రధాన రహదారిని విస్తరించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇప్పటికే గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందని తెలిపారు. నిర్వాసితుల నుంచి ఏమైనా అభ్యంతరాలు ఉంటే వాటిని స్వీకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం కోసం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్వాసితులకు న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ రామతీర్థపు మాధవి, ఇన్‌ఛార్జి కమిషనర్ సంపత్‌రెడ్డి, తహసీల్దార్ మహేశ్, పట్టణ ప్రణాళిక విభాగం అధికారి అన్సారి, కౌన్సిలర్లు, నిర్వాసితులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం రహదారి విస్తరణ చేపట్టవద్దని నిర్వాసితులు పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.

# నూతన ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ పూర్తి

**సిరిసిల్ల(విద్యానగర్), కలెక్టరేట్, న్యూస్‌టుడే:** డీఎస్సీ ద్వారా ఎంపికైన 132 మంది నూతన ఉపాధ్యాయులను జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టుల్లో నియమించారు. మంగళవారం కలెక్టరేట్‌లో కౌన్సెలింగ్ నిర్వహించారు. తొలుత కౌన్సెలింగ్ వాయిదా అనడంతో అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. పలువురు అక్కడే వేచి ఉండగా, కొందరు వెనుదిరిగారు. కౌన్సెలింగ్ ప్రారంభించాలని ఆదేశాలు రావడంతో సాయంత్రం మళ్లీ ప్రారంభించగా హాజరయ్యారు. రాత్రి 9 గంటలకు పూర్తి చేసి అభ్యర్థులకు ఉత్తర్వులు ఇచ్చారు. ఈ ప్రక్రియను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిశీలించారు. వీరంతా ఈనెల 16న పాఠశాలల్లో చేరాలని సూచించారు. డీఈవో రమేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కౌన్సెలింగ్‌కు హాజరైన అభ్యర్థులు



# పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకా

న్యూస్‌టుడే, సిరిసిల్ల కలెక్టరేట్

గాలికుంటువ్యాధి నివారణకు పశువులకు టీకా వేయడం ప్రారంభించారు. జిల్లాలో అన్ని గ్రామాల్లోని పశువులకు జిల్లా పశువైద్యశాఖ ఆధ్వర్యంలో వేస్తున్నారు. నెల రోజుల పాటు ఈ కార్యక్రమం కొనసాగనున్నది. ఈ వ్యాధి క్రిములు గాలితో ప్రయాణించి ఇతర పశువులకు సోకే అవకాశం ఉన్నందున జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో పశువైద్యులతో పాటు సిబ్బంది ప్రతి పశువుకు టీకా వేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఈ టీకాను ప్రతి ఆరు నెలలకు ఒకసారి వేసి రాబోయే నాలుగేళ్లలో గాలికుంటు వ్యాధిని పూర్తిగా నివారించేందుకు జిల్లా పశువైద్యశాఖ అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు.

| | | |
|---|---|---|
| మొత్తం పశువులు | : | 1,17,240 |
| వీటిలో ఎద్దులు, కోడెలు | : | 17,934 |
| దున్నపోతులు | : | 4,884 |
| ఆవులు | : | 25,884 |
| బర్రెలు | : | 68,538 |

- ఈనెల 15 నుంచి వచ్చే నెల 14 వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.
- అధికారులు గ్రామాలకు వెళ్లే ముందు రోజు పల్లెల్లో టాం టాం వేయించి ఈ కార్యక్రమాన్ని కొనసాగించనున్నారు.
- పశువైద్యులు, సిబ్బంది ప్రతి రైతు వద్దకు వెళ్లి పశువులకు వేయనున్నారు.
- అధికారులు వెళ్లినపుడు గ్రామాల్లో లేని రైతుల పశువుల కోసం మరో 10 రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నారు.

### వ్యాధి లక్షణాలు ఇవీ...

పశువులకు గాలికుంటు వ్యాధి సోకినప్పుడు గాలి ద్వారా వాటికి సమీపంలోని చుట్టు పక్కల 5 కిలోమీటర్ల దూరంలో ఉన్నవాటికి కూడా ఈ వ్యాధి సోకే అవకాశం ఉంది.

- వాటికి 105 డిగ్రీల జ్వరం వస్తుంది. పశువుల నోటిలో పుండ్లు ఏర్పడి నాలుక చెడిపోయి మేతతో పాటు నీరు తాగడానికి ఇబ్బంది పడతాయి.
- రోజు రోజుకు క్షీణించి సన్నగా మారి మరణిస్తాయి.
- కాళ్లగిట్టలకు పుండ్లు ఏర్పడి నొప్పి పెట్టడంతో పాటు నడవలేని పరిస్థితి ఉంటుంది.
- పాల దిగుబడి తగ్గుతుంది.
- గర్భంతో ఉన్న పశువులకు గర్భస్రావం అయ్యే అవకాశం ఉంది.

### నెల రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్

### సిబ్బంది కొరతతో...

పశువైద్య శాఖలో ఖాళీలను 2018 నుంచి భర్తీ చేయడం లేదు. దీంతో సిబ్బంది కొరత భారీగా ఏర్పడింది.

- జిల్లాలో పశువైద్యాధికారులు మొత్తం 17 మందికి గాను ఏడుగురు ఉన్నారు. వీరిలో అయిదుగురు రెగ్యులర్ డాక్టర్లు కాగా, ఇద్దరు ఒప్పంద పద్ధతిలో పని చేస్తున్నారు.
- జిల్లాలోని 17 వైద్యశాలలతోపాటు సిరిసిల్ల ప్రాంతీయ వైద్యశాలలో కలిపి మొత్తం 32 మంది సిబ్బందికి గాను కేవలం 10 మంది ఉన్నారు. గోపాలమిత్రలు 20 మంది పని చేస్తున్నారు.
- జిల్లాలో పశువైద్యాధికారులు, సిబ్బంది కొరత కారణంగా ఉన్నవారిపై భారం పడుతుంది. ప్రస్తుతం ఉన్నవారితోనే ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు.


తంగళ్లపల్లి మండలం దేశాయిపల్లిలో గేదెకు టీకా వేస్తున్న పశువైద్య సిబ్బంది

### రైతులు సద్వినియోగం చేసుకోవాలి



జిల్లాలో ఉన్న అన్ని రకాల పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలు వేస్తున్నాం. ఈ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు కొనసాగిస్తాం. గ్రామాల్లో పశువులు ఉన్న రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. పశువైద్య సిబ్బంది వచ్చి వేస్తారు. ఎవరి పశువులు అయినా మిగిలిపోతే వాటి కోసం 10 రోజుల పాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం. జిల్లాలోని పశువులకు గాలికుంటువ్యాధి సోకకుండా పూర్తిగా నివారించేందుకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి వేస్తాం. **- రవీందర్‌రెడ్డి, జిల్లా పశువైద్యాధికారి**

నేడు ప్రపంచ ఆహార దినోత్సవం

# కల్తీ కబళిస్తోంది

ఆహార పదార్థాలు పండిన చోటు నుంచి లేదా తయారైన చోటు నుంచి వినియోగదారులకు చేరే క్రమంలో కొందరు స్వార్థపరుల వల్ల కల్తీకి గురవుతున్నాయి. పదార్థాలు ఆకర్షణీయంగా ఉండాలనో.. ఎక్కువకాలం నిలువుండాలనో.. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందాలనో ఇలా రకరకాల ప్రయోజనాలు ఆశించి అవసరం లేని రసాయనాలు వాడి ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నారు. అందుకే శరీరంలో ఏదో తెలియని నిస్సత్తువ. కొందరికి అంతే లేని అరగని బలం. శుభ్రమైన నీరు.. నాణ్యమైన ఆహార పదార్థాలు అందుబాటులో లేకుండా పోతున్నాయి. బుధవారం ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ఆహార భద్రతపై 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

– న్యూస్‌టుడే, కరీంనగర్ పట్టణం, కరీంనగర్ సాంస్కృతికం

**వయసుల వారీగా వినియోగం (కలరీల్లో)**

| | |
|---|---|
| 2-3 ఏళ్ల మధ్య వారు | 1000-1400 |
| 18 వయసులోపు వారు | 2,400 |
| 19-20 మధ్య.. | 2,600 |
| 21-40 సంవత్సరాల వయసు వారికి | 2400 |
| 41-60 మధ్య వయసు వారు | 2200 |
| 61 ఏళ్ల పైబడిన వారు | 2000 |



సిరిసిల్ల: శుభకార్యంలో మిగిలిన ఆహార పదార్థాలను పంపిణీ చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ దంపతులు

ఉదయం లేచినప్పటి నుంచి డబ్బిచ్చి సేవలు పొందుతున్నారు. ప్రతి సందర్భంలోనూ వినియోగదారులమే. మనకు కావాల్సిన వస్తువుల కల్తీలు, సేవల్లో అందించేది ప్రైవేటు వ్యక్తులు.. సంస్థలు.. ప్రభుత్వమైనా కావచ్చు. చెల్లించిన సొమ్ముకు తగిన ప్రతిఫలం ఆశించడం వినియోగదారుల హక్కు. డబ్బిచ్చి అనారోగ్యం పొందడం ఎంతవరకు సమంజసం. అవసరమైనప్పుడు హక్కు వినియోగించుకుని చైతన్యం ప్రతి ఒక్కరిలో ఉండాలని పౌరసమాజం కోరుకుంటోంది.

డబ్బులిచ్చి జబ్బు పడాలా?

## ఎలా చేస్తారంటే..

**పాలు, పాల ఉత్పత్తులు:** తరచూగా కల్తీకి గురయ్యేవి పాలు. వాడే పాలు అందులో ఏ నీళ్లు పడితే ఆ నీళ్లు కలిపితే అనారోగ్యం తప్పదు. పాల రంగు, చిక్కదనం కోసం చాక్ పౌడర్, యూరియా, కాస్టిక్ సోడా, హైడ్రోజన్ పెరాక్సైడ్ లాంటివి కలపడం వల్ల జీర్ణ సంబంధ సమస్యలు, పిల్లల్లో హార్మోన్ల సమస్యలు వస్తాయి.

**పప్పులు:** ఆకర్షణీయంగా కన్పించేందుకు మెటానిల్ ఎల్లో కలర్ కలుపుతారు. ఇది కలిపిన ఆహారపదార్థాలు తింటే న్యూరోటాక్సిసిటీ అనే సమస్య.. నాడీ వ్యవస్థ దెబ్బతినే ప్రమాదం ఉంది.

**మసాలా దినుసులు:** మిరియాల్లో బొప్పాయి గింజలు, పసుపులో మెటానిల్ ఎల్లో, రెడ్ ఆక్సైడ్, ఇంగువలో మట్టి, కారంలో ఇటుక పొడి కలుపుతారు. ఖరీదైన కుంకుమ పువ్వులో మొక్కజొన్న పీచును కలుపుతారు.

**కూరగాయలు, పండ్లు:** కాస్త ఎక్కువగా వచ్చేందుకు, పురుగు పట్టకుండా ఉండేందుకు ఎన్నో రసాయన మందులు వినియోగిస్తున్నారు. ఆకర్షణీయంగా కనిపించేందుకు రసాయన రంగుల్ని ఇంజెక్ట్ చేస్తారు. ఆకుపచ్చని కూరలు మరింత పచ్చగా తాజాగా కనిపించేందుకు మాలకైట్ గ్రీన్ అనే రసాయన రంగు క్యాన్సర్ కారకం కూడా. ఇంకా ఆక్సిటోసిన్, శాకరిన్, వ్యాక్స్, కాపర్ సల్ఫేట్ వంటివి వాడుతున్నారు.

## ఇదీ నేపథ్యం..

1945లో ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ స్థాపనకు గుర్తింపుగా ఏటా అక్టోబరు 16న ప్రపంచ ఆహార దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. 'మంచి భవిష్యత్తు కోసం ఆహారం అందించడమే లక్ష్యం' అనే థీమ్‌ను ఈ ఏడాది తీసుకున్నారు.

## వృథా వద్దు..

✦ జనాభాకు అనుగుణంగా అవసరమైన ధాన్యంతోపాటు ఇతరత్రా ఆహార పదార్థాల సరఫరా లేదు. శుభకార్యాల సందర్భంగా మిగిలిన ఆహారం వృథాగా పారేస్తున్నారు. అవే పదార్థాలు అనాథలు, పేదలకు అందించే సంకల్పంతో కొందరు స్వచ్ఛందంగా సేవలందిస్తున్నారు. వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమం 9949 914242కు ఫోన్ చేస్తే వారే వ్యాన్ లేదా ఆటోలో వచ్చి ఆహారం తీసుకొని వెళ్తారు.

✦ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్ దంపతులు ఆరేళ్లుగా శుభకార్యాల్లో మిగిలిన ఆహారాన్ని స్లమ్ ఏరియాలోని కుటుంబాలకు అందిస్తున్నారు. 93945 05101కు ఫోన్ చేస్తే వారే అద్దె ఆటోలో తీసుకెళ్లి పేదలకు అందిస్తున్నారు.

## రంగులు కలిపితే సమస్యలు తప్పవు

**- సాయి ప్రియ, న్యూట్రీషియనిస్ట్, కరీంనగర్**



ఆహార పదార్థాల్లో రసాయన రంగులు కలపడం వల్ల క్యాన్సర్, రక్తహీనత సమస్యలు తలెత్తుతాయి. జంక్ ఫుడ్, మంచూరియా, చిల్లీ పౌడర్, ఆయిల్స్, రెడీ ఈట్ ఫుడ్‌లో ఇవి ఎక్కువగా కలిసే అవకాశం. ప్యాకెట్ ఫుడ్‌లో ఏయే పదార్థాలు కలిపారో చూసుకొని తినాలి. ఎక్కువగా కొబ్బరి, ఇతరాత్ర చెట్ల పాలు తాగడం మంచిది. సహజంగా దొరికే ఆకు కూరలు, కూరగాయలు తీసుకోవాలి.

## కనిపెట్టడం ఇలా..

● చిన్న సీసాలో కొద్దిగా పాలు తీసుకొని గిలకొట్టాలి. డిటర్జెంట్ లాంటివి కలిపితే నురగ ఎక్కువగా వస్తుంది.

● తెల్లని బ్లాటింగ్ పేపర్‌ని తడిపి కానీ తడి దూదితో కానీ కూరగాయలు, పండ్లు తుడిస్తే కృత్రిమ రంగు ఉంటే తెలిసిపోతుంది.

● ఐస్ క్రీం కొంచెం విడిగా తీసి దాని మీద రెండు చుక్కల నిమ్మరసం పిండాలి. నురగలు వస్తే కల్తీ జరిగినట్లే.

● మిరియాలను ఆల్కహాల్‌లో వేస్తే మునిగిపోతాయి. బొప్పాయి గింజలు కలిస్తే తేలుతాయి.

● పంచదార, ఉప్పుల్లో కల్తీ జరిగినట్లు అనుమానమొస్తే వెంటనే తీసుకొని నీళ్లలో వేస్తే అవి కరిగిపోతాయి. కల్తీ ఉంటే చాక్ పౌడి అడుగున పేరుకుంటుంది.

● కాస్త తేనెలో దూదిని ముంచి తీసి వెలిగిస్తే మండుతుంది. కల్తీ అయితే చిటపటలాడుతుంది.

● కరిగిన నెయ్యిలో ఒక స్పూన్ చక్కెర వేసి బాగా కలపాలి. ఐదు నిముషాల తర్వాత అది ఎరుపు రంగులోకి మారితే కల్తీ జరిగినట్లు.

● పసుపు కానీ పప్పు కానీ.. కొద్దిగా నీళ్లలో వేసి దాంట్లో కొన్ని చుక్కలు హైడ్రోక్లోరిక్ ఆసిడ్ వేయాలి. నీళ్లలో ఎల్లో కలర్ కల్తీ జరిగితే నీరు ఊదారంగులోకి మారుతుంది. పసుపులో లెడ్ క్రోమైట్ కలిసినట్లయితే నీళ్లు మరీ ఎక్కువ పచ్చగా మారుతాయి. మంచి పసుపు నీళ్లలో కరగకుండా అడుగున చేరుకుంటుంది.



జమ్మికుంట మార్కెట్లో పత్తి బిడ్డింగ్

## స్వల్పంగా తగ్గిన పత్తి ధర

**జమ్మికుంట, న్యూస్‌టుడే:** జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం పత్తి ధర స్వల్పంగా తగ్గింది. యార్డుకు 30 ట్రాలీల కొత్త విడి పత్తిని రైతులు విక్రయానికి తీసుకురాగా బిడ్డింగ్‌లో కనిష్ఠ ధర రూ.6200, గరిష్ఠ ధర రూ.6900 పలికింది. 10 క్వింటాళ్ల బస్తాల పత్తిని విక్రయానికి తేగా రూ.6,100 నుంచి రూ.6,500 వరకు పలికింది. మొత్తంగా ధర సోమవారం కంటే రూ.60 మేర తగ్గింది. బిడ్డింగ్‌ను మార్కెట్ కార్యదర్శి రాజా పరిశీలించారు. తేమ శాతం అధికంగా ఉండటం వల్లే ధర తగ్గిందని అధికారులు చెబుతున్నారు.

## జగిత్యాల బీటుకు అధికంగా మక్కలు

**జగిత్యాల వాణిజ్యం, న్యూస్‌టుడే:** జగిత్యాల వ్యవసాయ మార్కెట్ యార్డుకు రైతులు మంగళవారం 724 క్వింటాళ్ల మక్కలను విక్రయానికి తెచ్చారు. బీటులో మక్కలకు క్వింటాకు కనిష్ఠంగా రూ.1,805 నుంచి గరిష్ఠంగా రూ.1,950 వరకు ధర పలికిందని మార్కెట్ కార్యదర్శి టి.రాజశేఖర్ తెలిపారు. ఎంటీయూ- 1010 దొడ్డురకం ధాన్యానికి సగటున రూ.1,870 చొప్పున ధర లభించినట్లు పేర్కొన్నారు.

## అగ్నిమాపక శాఖ సిబ్బందికి నైపుణ్య శిక్షణ



సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న శిక్షకులు

**కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే :** కరీంనగర్ మానేరు జలాశయంలో రెండు రోజులపాటు నిర్వహించే అగ్నిమాపక శాఖ జోనల్ స్థాయి నైపుణ్య శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. మొదటి రోజు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కామారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి హాజరైన 70 మంది సిబ్బందికి శిక్షణ అందించారు. కొత్తగా కొనుగోలు చేసిన రిమోట్ కంట్రోల్ లైఫ్ సేవింగ్ బోట్‌పై శిక్షణ, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. బుధవారం కరీంనగర్, నిర్మల్, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, ములుగు, ఆసిఫాబాద్ జిల్లాల 60 మంది సిబ్బందికి శిక్షణ ఇవ్వనున్నారు. శిక్షణ కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా అధికారి భగవాన్‌రెడ్డి పర్యవేక్షించారు.

## అండర్-23 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు 18న

**కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే:** అండర్-23 అంతర్ జిల్లాల క్రికెట్ పోటీల్లో పాల్గొనే కరీంనగర్ జిల్లా జట్టు ఎంపిక పోటీలు ఈనెల 18న కరీంనగర్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ మైదానం ఆవరణలో నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి ఎన్.మురళీధర్‌రావు ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని క్రీడాకారుల్లో 60 మందిని ఎంపిక చేసి, 15 మంది చొప్పున నాలుగు జట్లుగా విభజించి మ్యాచ్‌లు నిర్వహిస్తామన్నారు. ఇందులో నుంచి తుది జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఈ జట్టు నవంబర్ నెల హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెదక్, వరంగల్ జిల్లాల్లో జరిగే అంతర్ జిల్లాల పోటీల్లో పాల్గొంటుందన్నారు. క్రీడాకారులు సొంత కిట్టు, యూనిఫాం, 10వ తరగతి మెమో, జనన ధ్రువపత్రం, ఆధార్‌కార్డు, రెండు ఫొటోలతో ఈనెల 17న సాయంత్రం 5 గంటల వరకు కేడీసీఏ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. క్రీడాకారులు 2001 సెప్టెంబరు 1 తర్వాత జన్మించి ఉండాలన్నారు. ఎంపిక మ్యాచ్‌లకు కేడీసీఏ ఉపాధ్యక్షులు కె.మహేందర్‌గౌడ్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారని, ఉపాధ్యక్షుడు పి.మనోహర్‌రావు సభ్యుడు అజిత్‌కుమార్‌లు మ్యాచ్‌లను పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

# క్రికెట్‌లో మెరుపులు

● బ్యాట్ పడితే సిక్స్.. బంతి విసిరితే బోల్డ్
● రాణిస్తున్న ఉమ్మడి జిల్లా అండర్-19 క్రీడాకారులు

న్యూస్‌టుడే
కరీంనగర్ క్రీడా విభాగం

బ్యాట్ పట్టి క్రీజ్‌లోకి వెళ్తే వచ్చిన బంతి సిక్స్ వెళ్లాల్సిందే.. ప్రత్యర్థి ఎవరైనా బంతి విసిరితే క్లీన్ బౌల్డ్ కావడం తథ్యం.. వెరసి ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు కప్పు కొట్టడం ఖాయం.. ఉమ్మడి జిల్లా క్రికెట్ క్రీడాకారులు తమదైన ప్రతిభతో ముందుకు సాగుతూ క్రికెట్ అభిమానుల అభినందనలు అందుకుంటున్నారు. ఇటీవల హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలో జరిగిన అంతర్ జిల్లాల అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలుగా నిలిచి ట్రోఫీని అందుకున్నారు. ప్రతిభ చాటుతున్న ఉమ్మడి జిల్లా క్రీడాకారులతో 'న్యూస్‌టుడే' కథనం.



### 11 ఏళ్లుగా ఆడుతూ..

కరీంనగర్‌కు చెందిన ధర్మపురి ఆంజనేయులు, సంధ్యారాణిల కుమారుడు సాత్విక్ తల్లిదండ్రుల ప్రోత్సాహంతో 11 ఏళ్లుగా క్రికెట్ సాధన చేస్తున్నాడు. తల్లి ప్రభుత్వ ఉపాధ్యాయురాలు, తండ్రి పోలీసు శాఖలో ఉద్యోగం చూస్తూ కుమారుడికి క్రికెట్‌పై ఉన్న ఆసక్తిని గుర్తించి కోచింగ్ ఇప్పిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో సాత్విక్ సుమారు 150 మ్యాచ్‌ల్లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లు, సిరీస్‌లు అందుకున్నాడు. ఇటీవల జరిగిన అండర్-19 రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యాడు. భారత జట్టు జెర్సీని వేసుకుని ఆడినప్పుడే తనకు అసలైన ఆనందం ఉంటుందని సాత్విక్ చెబుతున్నాడు.

### మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌తో ప్రశంసలు..



మెట్టుపల్లికి చెందిన నగేష్ భీమ్నాథ్-పద్మావతిల కుమారుడు విఘ్నేష్‌కు చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే ఇష్టం. నాలుగేళ్ల నుంచి మెట్‌పల్లి నుంచి కరీంనగర్‌కు వచ్చి క్రికెట్ సాధన చేస్తున్నాడు. ఇటీవల వరంగల్‌లో జరిగిన అండర్-19 టోర్నమెంట్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌లు, మ్యాన్ ఆఫ్ ది సిరిస్‌గా నిలిచి అతిథుల ప్రశంసలు అందుకున్నాడు. పాఠశాల, కళాశాల స్థాయిలో ఇప్పటి వరకు సుమారు 70 మ్యాచ్‌లు ఆడి ప్రతిభ చాటాడు. భారత జట్టుకు ఎంపికయ్యే వరకు నిత్యం సాధన చేస్తూనే ఉంటానని, మెట్‌పల్లి నుంచి కరీంనగర్‌కు వచ్చి సాధన చేయడం కష్టంగా ఉన్నా.. ఇష్టంగా చేస్తున్నానని విగ్నేష్ చెప్పాడు

### బృంద నాయకుడిగా ముందుండి నడిపిస్తూ..



జగిత్యాల జిల్లా కొడిమ్యాలకు చెందిన ఎర్రోజు మోహనాచారి, స్వప్నల కుమారుడు తక్షిల్ కొడిమ్యాలకు చెందిన సీనియర్లను చూసి ఏడేళ్లుగా సాధన చేస్తున్నాడు. తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో తనకు ఆటలపై ఆసక్తి ఉండటంతో క్రికెట్‌పై శిక్షణ ఇప్పిస్తున్నాడు. వరంగల్‌లో జరిగిన అండర్-19 క్రికెట్ టోర్నమెంట్‌లో కరీంనగర్ జిల్లా జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి ప్రతి మ్యాచ్‌లో సత్తా చాటి జట్టు విజయంలో ప్రధాన పాత్ర పోషించాడు. 2022లో ఎస్‌జీఎఫ్ అండర్-17 క్రికెట్ జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. 2020లో హైదరాబాద్ అండర్-14 జట్టుకు ఎంపికయ్యాడు. ఇప్పటి వరకు సుమారు 100 మ్యాచ్‌లు ఆడాడు. భారత జట్టుకు కెప్టెన్ కావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్లు తక్షిల్ తెలిపాడు.

### ఏకలవ్యుడిగా సాధన...



కరీంనగర్‌కు చెందిన పల్లె పరశురాములు, సునీతల కుమారుడు ఆదిత్య క్రికెట్‌ను ఆరాధిస్తాడు. భారత జట్టుకు ఎప్పుడు, ఎలాంటి మ్యాచ్ ఉన్నా టీవీ ముందు నుంచి కదలడు. చిన్నప్పటి నుంచి క్రికెట్‌పై ఇష్టంతో నాలుగేళ్ల నుంచి సాధన చేస్తున్నాడు. క్రికెట్‌లో భవిష్యత్తు ఉండదని ఎంత మంది చెప్పినా లెక్క చేయకుండా స్వయంగా సాధన చేస్తున్నాడు. సుమారు 23 జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ చాటి మంచి గుర్తింపు సాధించాడు. క్రికెట్ ఆటపై ప్రావీణ్యం పెంచుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించాలని కోచ్‌గా ఎదిగి ఉన్నతమైన క్రికెటర్‌లను తయారు చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాడు.



## పాతకక్షలతో యువకుడి హత్య



సాగర్

**కోరుట్ల, న్యూస్‌టుడే:** పాతకక్షలతో యువకుడు దారుణ హత్యకు గురైన ఘటన కోరుట్ల పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అయిలాపూర్ ప్రాంతంలో నివసిస్తున్న బోయిని సాగర్ (కల్యాణ్) (32)కి కోరుట్ల పట్టణంలోని కొంత మందితో స్నేహం ఉండేది. గతంలో మద్యం తాగుతున్న క్రమంలో గొడవ జరగగా కక్ష పెంచుకున్నారు. ఆదివారం రాత్రి ప్రకాశం రోడ్‌లో సాగర్ మద్యం తాగుతుండగా.. కొందరు అక్కడి చేరుకొని గొడవకు దిగారు. స్థానికులు 100 నంబర్‌కు సమాచారం అందించగా పోలీసులు చేరుకొని అందరిని అక్కడి నుంచి పంపించేశారు. రాత్రి 11.30 ప్రాంతంలో మరోమారు గొడవకు దిగి సాగర్‌పై దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో ఓ యువకుడు సాగర్ మెడపై దాడి చేసిన అనంతరం నిందితులందరూ పరారయ్యారు. సాగర్ అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. సీఐ సురేశ్‌బాబు, కోరుట్ల, కథలాపూర్ ఎస్సైలు శ్రీకాంత్, నవీన్‌కుమార్‌లు మృతదేహాన్ని పరిశీలించి హత్యకు గల కారణాలు తెలుసుకున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు పేర్కొన్నారు.

## 20న జూనియర్ ఖోఖో జట్టు ఎంపిక పోటీలు

**కరీంనగర్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే:** ఈనెల 20న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూనియర్ ఖోఖో జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి వై.మహేందర్‌రావు తెలిపారు. క్రీడాకారులు 2006 నవంబరు 22 తరువాత పుట్టిన వారై ఉండాలన్నారు. 10వ తరగతి మెమో, ఆధార్‌కార్డు జిరాక్స్‌లు, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఉదయం 9.00 గంటలలోపు అంబేడ్కర్ స్టేడియంలో రిపోర్టు చేయాలని సూచించారు. ప్రతిభ చాటిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు.

## జగిత్యాల డీఎస్పీకి అతి ఉత్కృష్ట పతకం

**జగిత్యాల, న్యూస్‌టుడే:** జగిత్యాల డీఎస్పీ దురిశెట్టి రఘుచందర్‌కు కేంద్ర ప్రభుత్వం అతి ఉత్కృష్ట పతకం ప్రకటించింది. మావోయిస్టు కార్యకలాపాలను ధైర్యంగా ఎదుర్కొన్నందుకు, పోలీసు శాఖలో విశేషమైన సేవలందించినందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకమైన ఈ పతకానికి ఎంపిక చేసింది. ఈ సందర్భంగా ఆయనను జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

## తండ్రిని చంపిన తనయుడికి జీవితఖైదు

**జగిత్యాల, న్యూస్‌టుడే:** తండ్రిని చంపిన తనయుడికి జగిత్యాల న్యాయస్థానం మంగళవారం జీవితఖైదు విధించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. గొల్లపల్లి మండలం రాపల్లికి చెందిన గడుగు పోచయ్య, శాంతలకు నలుగురు కుమారులు. పోచయ్య కుమారులు చేసిన అప్పులు తీర్చడానికి కొంత భూమి విక్రయించేందుకు ఇతరులతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇది నచ్చని చిన్న కుమారుడు ప్రభుదాస్.. తల్లిదండ్రులతో గొడవకు దిగాడు. 2008 నవంబర్ 23న తన తల్లి శాంతపైకి రాళ్లు విసరగా గాయపడ్డారు. విషయం తెలిసిన పోచయ్య ఇంటికి రాగా ప్రభుదాస్ కర్రతో దాడి జరిపి తీవ్రంగా గాయపర్చాడు. అతడిని ఆసుపత్రికి తరలించగా మృతి చెందారు. గొల్లపల్లి పోలీసులు నిందితుడిని రిమాండ్‌కు పంపించారు. అప్పటి ఇన్‌స్పెక్టర్లు జి.మహేశ్‌బాబు, ఎం.రవీందర్‌రెడ్డి దర్యాప్తు చేసిన ఈ కేసులో కోర్టు విధుల అధికారులు జి.రాజునాయక్, ఎం.కిరణ్‌కుమార్, శ్రీధర్‌లు న్యాయస్థానానికి సాక్ష్యాధారాలు సమర్పించారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ మల్లికార్జున్ వాదించగా నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవితఖైదు, రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.నీలిమ తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్ష పడడానికి చొరవ చూపిన అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ అభినందించారు.

# విదేశీ కొలువు.. ఇలా సులువు

● టామ్‌కామ్ ఆధ్వర్యంలో నియామకాలు
● రేపు కరీంనగర్‌లో జాబ్ మేళా

**ఈనాడు, సిరిసిల్ల**

ఉమ్మడి జిల్లాలో స్థానిక ఏజెంట్ల చేతిలో మోసపోయి గల్ఫ్ దేశాల్లో చాలా జీవితాలు వెళ్లదీస్తున్నారు. అక్కడ సరైనా పని.. తిండి లేక నరకం అనుభవిస్తున్నారు. విదేశాల్లో ఉండలేక.. స్వదేశాలకు రాలేక అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో విదేశాల్లో ఉద్యోగాలు చేయాలనుకునే యువతకు తెలంగాణ విదేశీ మానవ వనరుల సంస్థ(టామ్‌కామ్) సువర్ణావకాశాలు కల్పిస్తోంది. జిల్లాల వారీగా ఉద్యోగ మేళాలను నిర్వహిస్తోంది. యూఏఈలో డెలివరీ బాయ్స్ నియామకాల కోసం ఈ నెల 17న కరీంనగర్‌లోని మున్సిపల్ కార్యాలయం పక్కనున్న ఓ హోటల్‌లో మేళా నిర్వహిస్తోంది. దీనికి 21 నుంచి 40 ఏళ్ల వయస్సు వారు అర్హులు.

వీరు పదో తరగతి మెమోతో పాటు పాస్‌పోర్టు, మూడేళ్ల క్రితం తీసిన డ్రైవింగ్ లైసెన్స్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో మేళాకు హాజరు కావాలి. నియామక ప్రక్రియ దాదాపు నెల రోజుల్లో పూర్తి చేసి. కేవలం మెడికల్ పరీక్షలకు డబ్బులు తీసుకొని విదేశాలకు పంపిస్తారు. ఉమ్మడి జిల్లావాసులు ఈ మేళాకు హాజరు కావచ్చు.

● సిరిసిల్లకు చెందిన ఇమ్రాన్‌కు ఏజెంటు సూపర్ మార్కెట్‌లో పని ఉందని రూ.1.20 లక్షలు తీసుకుని మూడు నెలల క్రితం కంపెనీ వీసా పేరుతో దుబాయ్ పంపించాడు. తీరా అక్కడికి వెళ్లాక వేరే పనులు చెప్పడంతో ఇమ్రాన్ ఇబ్బందులు పడ్డాడు. స్వదేశానికి పంపాలని యాజమాన్యాన్ని కోరితే చిత్రహింసలకు గురిచేశారు. సామాజిక మాధ్యమాల్లో గోడు వెళ్లబోసుకోవడంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అక్కడి ఎంబసీ అధికారులతో మాట్లాడి ఇమ్రాన్‌ను ఇక్కడికి రప్పించారు.

### 20 దేశాలకు విస్తరణ


టామ్‌కామ్ సంస్థ 2020 వరకు గల్ఫ్ దేశాలకు మాత్రమే నియామకాలు జరిపేది. తర్వాత జపాన్, యూరోపియన్, మిడిల్‌ఈస్ట్, కెనడా, ఆస్ట్రేలియా తదితర 20 దేశాలకు విస్తరించింది. నర్సింగ్, హోటల్, నిర్మాణ, డ్రైవింగ్ తదితర 15 రంగాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తోంది. ఆయా దేశాల ప్రభుత్వాలతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందం ప్రకారం నియామకాలు చేపడుతోంది. జర్మనీలో నర్సింగ్ కోసం ఈ నెల 14న కామారెడ్డి, జగిత్యాల జిల్లాలో అభ్యర్థులకు ముఖాముఖి నిర్వహించింది. 300 మంది హాజరుకాగా అందులో మహిళలు, పురుషులు కలిపి 153 మంది ఎంపికయ్యారు.

### భాషపై శిక్షణ

విదేశాలకు వెళ్లేవారికి హిందీ, ఆంగ్లంపైనే కాకుండా అక్కడి భాషపై అవగాహన ఉండాలి. ఇందుకు టామ్‌కామ్ ఆధ్వర్యంలో మన ప్రభుత్వమే ఆయా భాషలపై అభ్యర్థులకు ఉచిత శిక్షణిస్తుంది. ఒప్పందం చేసుకొని దేశాల భాషా శిక్షణకు అభ్యర్థులే ఫీజులు చెల్లించాల్సి ఉంటుంది.

### మెరుగైన వేతనాలు

విదేశాల్లో ఉద్యోగాలకు మెరుగైన వేతనాలు లభిస్తాయి. న్యాక్ సంస్థలో శిక్షణ పూర్తిచేసుకున్న వారికి జర్మనీలో నిర్మాణ రంగంలో ఉపాధి అవకాశాలు న్నాయి. రాష్ట్రం నుంచి అక్టోబరు మొదటి వారంలో 32 మంది జర్మనీకి వెళ్లారు. వీరికి ఏడాది ట్రైనీలుగా నెలకు రూ.1లక్ష వరకు వేతనం ఉంటుంది. పని బాగుంటే అదే కంపెనీలో అవకాశం ఇస్తారు. అప్పుడు నెలకు 2.80 లక్షల జీతం అందిస్తారు.




టామ్‌కామ్ యాప్

● జగిత్యాల జిల్లా సారంగపూర్‌కు చెందిన అజయ్ 14 నెలల క్రితం స్థానిక ఏజెంటుకు రూ.2.70 లక్షలు చెల్లించి ఇరాక్ వెళ్లాడు. అక్కడి ఏజెంటు పాస్‌పోర్టు తీసుకొని పని కల్పించలేదు. చేతిలో చిల్లి గవ్వ లేక పస్తులుంటున్నానంటూ తల్లిదండ్రులకు అజయ్ బాధపడుతూ వీడియో పంపించాడు. దీంతో వారు స్థానిక ఏజెంట్‌ను నిలదీయగా రూ.1 లక్ష తిరిగి ఇచ్చారు. పాస్‌పోర్టు లేక, వచ్చేందుకు డబ్బుల్లేక అజయ్ అక్కడే అవస్థలు పడుతున్నాడు.

### యాప్‌లో ఉద్యోగాల సమాచారం

టామ్‌కామ్ వెబ్‌సైట్‌తోపాటు యాప్‌లోనూ అన్ని వివరాలు అందుబాటులో ఉన్నాయి. అభ్యర్థులు, నిరుద్యోగులు విద్యార్హతలు, అనుభవం తదితర వివరాలు నమోదు చేసుకోవాలి. దీంతో ఏఏ దేశాల్లో ఎలాంటి ఉద్యోగావకాశాలు ఉన్నాయనే సమాచారం అందులో ఉంటుంది. వెబ్‌సైట్, యాప్‌లోని సమాచారంతో జిల్లాల వారీగా జరిగే జాబ్‌మేళాలకు హాజరు కావచ్చని రాష్ట్ర టామ్‌కామ్ మేనేజర్ షబ్నం 'ఈనాడు'కు తెలిపారు.

## పద్మావతి అమ్మవారికి ఒడిబియ్యం సమర్పణ

**సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే:** సిరిసిల్లలోని శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా సిరిసిల్ల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మంగళవారం పద్మావతి అమ్మవారికి ఒడి బియ్యం, పట్టువస్త్రాలను సమర్పించారు. పట్టణంలోని మార్కండేయ దేవాలయంలో పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి ఒడిబియ్యం, సమర్పించారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ జిందం కళ, పద్మశాలి సంఘం నాయకులు గోలి వెంకటరమణ, గుండ్లపెల్లి పూర్ణచందర్, కాముని వనిత, గుజ్జె తార, కోడం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


ఒడిబియ్యం, పట్టువస్త్రాలతో పుర ఛైర్‌పర్సన్ కళ, పద్మశాలి సంఘం నాయకులు

## నేడు నీటి సరఫరాలో అంతరాయం

**సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే:** సిరిసిల్లలోని 120 ఎంఎల్‌డీ నీటి శుద్ధి కేంద్రంలో తాగునీటి పంప్‌హౌస్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం పలు నియోజకవర్గాల్లోని గ్రామాలకు నీటి సరఫరాలో అంతరాయం కలుగుతుందని సిరిసిల్ల డివిజన్ మిషన్ భగీరథ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎన్.విజయ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి నియోజకవర్గాల్లోని గ్రామాలు, పురపాలక సంఘాల్లో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. గురువారం సరఫరాను పునరుద్ధరిస్తామని వెల్లడించారు. అంతవరకు గ్రామాలు, పురపాలక సంఘాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని కోరారు.

## బాధిత మహిళలను ఇబ్బంది పెట్టొద్దు

**తంగళ్లపల్లి, న్యూస్‌టుడే:** తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మకాలనీలోని 8 మహిళా సంఘాలకు చెందిన 22 మంది బాధిత మహిళలకు సంబంధించిన డబ్బులతో పారిపోయిన మహిళా గ్రూప్ కమ్యూనిటీ అసిస్టెంట్ (సీఏ) సీపీ కల్యాణి దొరికే వరకు బ్యాంకు అధికారులు బాధిత మహిళలను ఇబ్బంది పెట్టవద్దని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన బ్యాంకు అధికారులతో మాట్లాడినట్లు కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గడ్డం మధుకర్ తెలిపారు. ఎనిమిది మహిళా సంఘాలకు సంబంధించిన రూ.15,77,500 తీసుకొని మహిళా గ్రూప్ సీఏ కల్యాణి పారిపోయిందని సదరు మహిళలు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన విప్ బ్యాంకు అధికారులకు ఫోన్ చేసి మాట్లాడినట్లు తెలిపారు. ఈ విషయమై తంగళ్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధిత మహిళలు పేర్కొన్నారు.

## ఎలక్ట్రానిక్ కాంటాలు అందజేత

**గంభీరావుపేట, న్యూస్‌టుడే:** మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షురాలు కొమిరిశెట్టి విజయ చేతుల మీదుగా మల్లారెడ్డిపేట ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు మంగళవారం ఎలక్ట్రానిక్ కాంటాలను అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షురాలు మాట్లాడుతూ మండలంలో ఉన్న ఐకేపీ కేంద్రాలకు కాంటాలు, టార్పాలిన్లు అందజేస్తామని తెలిపారు. రైతులకు సేవ చేయడానికి వ్యవసాయ మార్కెట్ కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, కమిటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.


కాంటాలు అందజేస్తున్న మార్కెట్ కమిటీ పాలకవర్గ సభ్యులు

## ఇసుక తరలింపునకు అనుమతి ఇవ్వండి

**తంగళ్లపల్లి, న్యూస్‌టుడే:** ప్రభుత్వ, స్థానిక అవసరాలకు ఇసుక కోసం అనుమతించాలని తహసీల్దార్ జయంత్‌కుమార్‌కు కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు మంగళవారం వినతి పత్రం అందజేశారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పనులు, స్థానిక అవసరాలకు ఇసుక కొరత ఉండటం వల్ల పనులన్నీ ఆగిపోయి ఇబ్బందికరంగా ఉందని, ఇసుక తరలింపునకు అనుమతించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జాల్గం ప్రవీణ్‌కుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు భైరినేని రాము, పెద్దూరు తిరుపతి, పర్శరాములు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 25న విద్యుత్తు వినియోగదారుల ముఖాముఖి

**సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే:** సిరిసిల్ల పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ఈ నెల 25న రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి ఆధ్వర్యంలో విద్యుత్తు వినియోగదారుల ముఖాముఖి కార్యక్రమం నిర్వహించనున్నట్లు సెస్ ఎండీ శ్రీనివాసరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు ఈ కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

## కేసీఆర్ నగర్‌లో డాగ్ స్క్వాడ్ తనిఖీలు

**తంగళ్లపల్లి, న్యూస్‌టుడే:** తంగళ్లపల్లి మండలం మండెపల్లిలోని కేసీఆర్ నగర్‌లోని కిరాణా దుకాణాలు, రెండు పడక గదుల ఇళ్ల బ్లాకులలో క్లూస్‌టీం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది తనిఖీలు చేశారు. గంజాయి, మత్తు పదార్థాలు నిల్వ ఉన్నా, విక్రయించినా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకొంటామని ఏఎస్ఐ చంద్రమౌళి పేర్కొన్నారు. స్థానిక దుకాణదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రశాంత్‌గౌడ్, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.


కేసీఆర్‌నగర్‌లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న ఏఎస్ఐ చంద్రమౌళి, సిబ్బంది

## ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి వినతి

**గంభీరావుపేట, న్యూస్‌టుడే:** గంభీరావుపేట మండలం నర్మాల గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని మాజీ సర్పంచి ఎడబోయిన రాజుతో పాటు పలువురు గ్రామస్థులు జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్‌కు మంగళవారం సిరిసిల్లలో వినతి పత్రాన్ని అందజేశారు. స్కూల్ అసిస్టెంట్‌లు ఆంగ్లం, సాంఘిక శాస్త్రం, హిందీతో పాటు మూడు ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఉపాధ్యాయులు లేక విద్యార్థులు చదవలేకపోతున్నారని పేర్కొన్నారు. పోస్టులు భర్తీ చేయాలని కోరారు. వినతి పత్రాన్ని అందించిన వారిలో కిశోర్, ఆంజనేయులు, సత్యనారాయణ తదితరులున్నారు.

### మండలంలో ఖాళీలను నింపాలని...

జిల్లాలోనే గంభీరావుపేట మండలం మారుమూల ప్రాంతమని, అభివృద్ధిలో వెనకబడిందని, మండలంలో ఖాళీగా ఉన్న ఎస్ఏ, ఎస్జీటీ పోస్టులను భర్తీ చేయాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు డీఈవోకు వినతి పత్రం అందజేశారు. డీఎస్సీ ద్వారా నూతనంగా ఎంపికైన వారిని మండలానికి కేటాయించాలని కోరారు.

## విద్యుదాఘాతంతో పాడిగేదె మృతి

**ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే:** ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్ గ్రామానికి చెందిన జెల్ల తులసి అనే మహిళకు సంబంధించిన పాడిగేదె మంగళవారం విద్యుదాఘాతంతో మృత్యువాత పడింది. పాడి గేదె నారాయణపూర్, బండలింగంపల్లి గ్రామాల శివారులో మేత కోసం వెళ్లింది. అక్కడ ఓ వ్యవసాయ పొలం వద్ద విద్యుత్తు మోటారుకు అమర్చిన తీగ కాళ్లకు చుట్టు కోవడంతో విద్యుదాఘాతానికి గురైనట్లు తెలిపారు. పాడిగేదె మృతితో సుమారు రూ. 60 వేల నష్టం వాటిల్లినట్లు బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది.

# రూ. లక్షలు వెచ్చించి... నిర్లక్ష్యంగా వదిలేసి

**న్యూస్‌టుడే, ఎల్లారెడ్డిపేట**

ఎల్లారెడ్డిపేట మండలం తిమ్మాపూర్, రాచర్ల బాకురుపల్లి గ్రామాల నడుమ కుడుకుంట చెరువుకట్ట కింద ప్రభుత్వ స్థలంలో రూ. లక్షల వ్యయంతో నిర్మించిన శ్మశానవాటిక నిరుపయోగంగా మారింది. 2021లో అప్పటి భారాస ప్రభుత్వం శ్మశాన వాటిక నిర్మాణానికి సుమారు రూ. 12.68 లక్షలను కేటాయించింది. గుత్తేదారు పనులు ప్రారంభించగానే రాచర్ల బాకురుపల్లి వాసులు ఆందోళన నిర్వహించారు. అక్కడ శ్మశాన వాటిక నిర్మిస్తే తాము పొగ, దుర్గంధంతో ఇబ్బంది పడతామని, చీకటిపూట రాకపోకలు సాగించే వారు భయభ్రాంతులకు లోనవుతారని పేర్కొంటూ ఉన్నతాధికారులను ఆశ్రయించారు. అయితే బర్నింగ్ ప్లాట్‌ఫాంలు, గదులు తదితర పనులు 80 శాతం మేర పూర్తయ్యాయి. శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ నిర్మాణం కోసం కూడా రూ. 2 లక్షల మంజూరుకు అప్పటి పంచాయతీ పాలకవర్గం తీర్మానించింది. దీంతో చెరువుకు సంబంధించిన స్థలంలో శ్మశానవాటిక నిర్మిస్తున్నారంటూ రాచర్ల బాకురుపల్లి వాసులు హైకోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు ప్రత్యేక చొరవతో సమస్యను పరిష్కరించాలని పేర్కొంటూ కలెక్టర్‌కు కోర్టు సూచించినట్లు గ్రామస్థులు తెలిపారు. ఏదేమైనప్పటికీ రూ.లక్షలు వెచ్చించినా శ్మశాన వాటిక సమస్యను ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రజాధనం వృథాగా మారింది.


నిరుపయోగంగా ఉన్న శ్మశానవాటిక

## ఔత్సాహిక నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలు

**వివిధ కోర్సుల్లో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ**

**సిరిసిల్ల గ్రామీణం, న్యూస్‌టుడే:** జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఔత్సాహిక నిరుద్యోగ యువకులకు సీసీటీవీ ఇన్‌స్టలేషన్, సాఫ్ట్ స్కిల్స్, బేసిక్ కంప్యూటర్‌పై మూడు నెలల పాటు ఉచిత శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని పేర్కొన్నారు. శిక్షణ అనంతరం హైదరాబాద్, కరీంనగర్, వరంగల్ వంటి నగరాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువకులు 10వ తరగతి సర్టిఫికెట్‌తో సంబంధిత పోలీస్ స్టేషన్లో ఈ నెల 18లోగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# గడువులోగా సీఎంఆర్ సరఫరా చేయాలి

**సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే:** గడువులోగా సీఎంఆర్ అందజేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ రైస్ మిల్లర్లను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో 2023-24 వానాకాలం, యాసంగి సీజన్‌కు చెందిన సీఎంఆర్ బియ్యం సరఫరాపై జిల్లాలోని రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-24 సీజన్‌లో 74 రా రైస్ మిల్లులు, 29 బాయిల్డ్ రైస్ మిల్లులకు మొత్తం 2,00,715 టన్నుల వరి ధాన్యం కొనుగోలు చేసి ఇచ్చినట్లు చెప్పారు. ఈ ధాన్యానికి సంబంధించిన 1,35,023 టన్నుల బియ్యం ప్రభుత్వానికి రావాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,00,978 టన్నుల బియ్యం మాత్రమే అందజేశారని పేర్కొన్నారు. మిగతా 34,045 టన్నుల బియ్యం మిల్లర్ల నుంచి ప్రభుత్వానికి రావాల్సి ఉందని తెలిపారు. ఈనెల 31లోగా అందజేయాలని ఆదేశించారు. అందజేయని వారి నుంచి 25 శాతం అపరాధ రుసుం వసూలు చేస్తామన్నారు. వరి కోతలు ప్రారంభమయ్యాయని, రెండు మూడు రోజుల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రతి మిల్లరు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ధాన్యం దిగుమతి చేసుకొని రైతులకు, ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వసంతలక్ష్మి, అదనపు పౌరసరఫరాల అధికారి నందిని, జిల్లా మేనేజర్ రజిత, మిల్లర్ల సంఘం అధ్యక్షుడు చేపూరి నాగరాజు, పబ్బ నాగరాజు, డిప్యూటీ తహసీల్దార్లు, మిల్లర్లు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

## అర్చకులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలి

**ముస్తాబాద్, న్యూస్‌టుడే:** ధూపదీప ఆలయ అర్చకులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రాచర్ల పార్థసారథిశర్మ ప్రభుత్వాన్ని కోరారు. ముస్తాబాద్ మండలం గూడూరులోని సాయి బాబా ఆలయ ఆవరణలో ధూప దీప ఆలయ అర్చకుల సమావేశం మండల అధ్యక్షుడు మధురాజేశ్వర్ శర్మ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు హాజరై మాట్లాడుతూ అర్చకులకు అంతంత మాత్రంగానే వేతనాలు ఉన్నాయన్నారు. అవి సకాలంలో రాక ఇబ్బందులకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. ఆరోగ్య కార్డులు అందించాలన్నారు. అర్చకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, వారి అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు కొండమాచార్యులు, ఉపాధ్యక్షుడు బిట్కూరి గోపాలచారి, ప్రధాన కార్యదర్శి పి. రమేశ్‌చారి, సంఘ నాయకుడు మెట్టు రామ శర్మ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రాచర్ల పార్థసారథి శర్మ

## కాటమయ్య కిట్లతో గీత కార్మికులకు రక్షణ

**వేములవాడ, న్యూస్‌టుడే:** కాటమయ్య కిట్లతో గీత కార్మికులకు పూర్తి రక్షణ ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ పట్టణంలోని మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలోని నూతన గ్రంథాలయ భవనంలో మంగళవారం గీత కార్మికులకు కాటమయ్య రక్షక కవచ కిట్లను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ అధికారి రాజమనోహర్, ఎక్సైజ్‌శాఖ అధికారి పంచాక్షరి, మున్సిపల్ వైస్ ఛైర్మన్ మహేశ్, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశంగౌడ్, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు శ్రీనివాస్, కనకయ్య, గౌడ సంఘం నాయకులు, వివిధ గ్రామాల లబ్ధిదారులు పాల్గొన్నారు.

## పశుసంపదను పెంపొందించుకోవాలి

**వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే:** పశుసంపదను పెంపొందించుకోవాలని, పాడి పరిశ్రమను కాపాడుకోవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. వేములవాడ గ్రామీణ మండలం లింగంపల్లిలో మంగళవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఉచిత టీకాలను పశుపోషకులు వినియోగించుకోవాలన్నారు. పాడి పరిశ్రమను పెంపొందించడంలో ప్రతి ఒక్కరూ ముందుండాలని పేర్కొన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి రవీందర్‌రెడ్డి, మండల వైద్యాధికారులు అభిలాష్, అంజిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## పైపులైన్ కట్ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

**కనగర్తి (కోనరావుపేట), న్యూస్‌టుడే:** కోనరావుపేట మండలం కనగర్తిలో ఓవర్‌హెడ్ ట్యాంకుకు నీటి సరఫరా చేసే మిషన్ భగీరథ పైపులైన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు మంగళవారం కట్ చేశారు. దీంతో నీరు వృథాగా పోతుంది. దుండగులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**బోయినపల్లి, న్యూస్‌టుడే:** బోయినపల్లికి చెందిన దాసరి బాబు జీవనోపాధి కోసం గల్ఫ్ వెళ్లి గుండెపోటుతో ఇటీవల మృతి చెందడంతో గల్ఫ్ కార్మికుల సంక్షేమ సంఘం (జీడబ్ల్యూఏసీ) ఆధ్వర్యంలో రూ. 80 వేల ఆర్థిక సాయం మంగళవారం బాబు కుటుంబ సభ్యులకు అందించారు. ఎన్ఆర్ఐ పాలసీ కోసం గల్ఫ్‌కార్మికుల మహా పాదయాత్రలో 1,009 కిలో మీటర్లు బాబు నడిచినట్లు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జీడబ్ల్యూఏసీ దుబాయి అధ్యక్షుడు కటుకం రవి, చందుర్తి మండల అధ్యక్షుడు మోతె రాములు, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి సత్యం, రాష్ట్ర కార్యదర్శి బిజిలి దేవయ్య, మహేందర్, యాద సుధాకర్, పుల్ల సాగర్ తదితరులు పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

## కలాం జయంతి వేడుకలు

**సిరిసిల్ల అర్బన్, న్యూస్‌టుడే:** సిరిసిల్ల పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. న్యూస్‌పేపర్ డిస్ట్రిబ్యూటర్ల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు, సిరిసిల్ల మున్సిపల్ మాజీ ఛైర్మన్ ఆడెపు రవీందర్ హాజరై కలాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం డిస్ట్రిబ్యూటర్లను శాలువాలతో సత్కరించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పోచంపల్లి రాజు, ఉపాధ్యక్షుడు గొల్లపల్లి మల్లేశం, కోశాధికారి బొద్దుల బాలకృష్ణ, సలహాదారుడు దేవదాస్, కార్యవర్గ సభ్యులు రాగుల వేణు, శ్రీకాంత్, శ్రీనివాస్, శ్రీహరి, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.


సిరిసిల్లలో నివాళులర్పిస్తున్న న్యూస్‌పేపర్ డిస్ట్రిబ్యూటర్లు

**వీర్నపల్లి:** కలాం ఆలోచన విధానాన్ని ప్రతి విద్యార్థి స్ఫూర్తిగా తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ పేర్కొన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లి ఉన్నత పాఠశాలలో మంగళవారం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కలాం జీవితం అనుసరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమారాణి, ప్రేమ్‌సాగర్, బలరాం, మంజుల, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


గర్జనపల్లిలో కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

## కథల పోటీల్లో ఆవునూర్ విద్యార్థినుల ప్రతిభ

**ఆవునూర్ (ముస్తాబాద్), న్యూస్‌టుడే:** మాచిరాజు బాలసాహిత్య పీఠం వారు నిర్వహించిన కథల పోటీల్లో ముస్తాబాద్ మండలం ఆవునూర్ జడ్పీ పాఠశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచి ప్రత్యేక బహుమతులు గెలుచుకున్నట్లు ప్రధానోపాధ్యాయుడు మద్దికుంట లక్ష్మణ్ మంగళవారం తెలిపారు. 10వ తరగతి విద్యార్థిని తోట పూజ రాసిన 'మావూరి అందాలు', 8వ తరగతి విద్యార్థిని జక్కుల శ్రావణి రాసిన 'స్నేహానికి ప్రతి రూపం' కథలు ప్రత్యేక బహుమతులకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

## జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలి

**వీర్నపల్లి, న్యూస్‌టుడే:** గ్రామీణ యువత జాతీయస్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఎస్సై ఎల్లయ్య పేర్కొన్నారు. వీర్నపల్లి మండల కేంద్రంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న మండలస్థాయి క్రికెట్ పోటీలు మంగళవారం ముగిశాయి. హోరాహోరీగా జట్లు తలపడగా ఎలైట్ ఈగల్ జట్టుపై రైసింగ్ స్టార్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలకు ప్రోత్సాహక నగదుతోపాటు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రఘురాం, ఎంపీవో వాజిద్, ఏఎంసీ ఛైర్మన్ రాములు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు అరుణ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు తిరుపతి, నాయకులు చంద్రమౌళి, శ్రీనివాస్, మదన్ తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందిస్తున్న అతిథులు

## పాఠశాలలో మందుబాబుల హల్‌చల్

**వెంకట్రావుపేట (కోనరావుపేట), న్యూస్‌టుడే:** కోనరావుపేట మండలం వెంకట్రావుపేట ప్రాథమికోన్నత పాఠశాలలో మందుబాబులు హల్‌చల్ చేశారు. 15 రోజులు సెలవులు ముగియగా మంగళవారం పాఠశాల పునః ప్రారంభమైంది. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలకు వెళ్లగా తరగతి గది తాళం, తలుపులు పగులగొట్టి కనిపించాయి. వరండాలో మద్యం ఖాళీ సీసాలు దర్శనమిచ్చాయి. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు.

## డీఎస్సీలో ఉద్యోగం రాలేదని మహిళ ఆత్మహత్య

**వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే:** డీఎస్సీలో ఉద్యోగం రాలేదని మనస్తాపం చెంది మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం వేములవాడ అర్బన్ మండలం ఆరెపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... సిరిసిల్ల పట్టణం నెహ్రూనగర్‌కు చెందిన నక్క దివ్య (33) భర్తతో విడాకులు తీసుకుని ఇంటి వద్ద ఉంటుంది. ఇటీవల డీఎస్సీ రాయగా ఉద్యోగం రాలేదు. దీనికి తోడు ఆర్థిక ఇబ్బందులున్నాయి. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఉదయం ఇంటి నుంచి వెళ్లి ఆరెపల్లి శివారులోని మధ్యమానేరు జలాశయం బ్యాక్ వాటర్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. ఆమె సోదరుడు నక్క కరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వేములవాడ పట్టణ సీఐ వీరప్రసాద్ తెలిపారు. మహిళ తండ్రి నేత కార్మికుడు గతంలో ఆత్మహత్య చేసుకోగా తల్లి శారదతో కలిసి ఉంటుంది.

### చెరువులో దూకి యువకుడు...

నేర వార్తలు

**వేములవాడ, న్యూస్‌టుడే:** వేములవాడ పట్టణానికి చెందిన ఓ యువకుడు గుడి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణానికి చెందిన మైత్రి నవీన్ (19) గుడి ముందు కొబ్బరికాయల విక్రయ దుకాణంలో గత కొంత కాలంగా పని చేస్తున్నాడు. అదే ప్రాంతంలోని ఓ వివాహితతో తలెత్తిన విభేదాల కారణంగా జీవితంపై విరక్తి చెందిన నవీన్ గుడి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని తల్లి సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అంజయ్య తెలిపారు.

## మనోవేదనతో వృద్ధుడి బలవన్మరణం

**బోయినపల్లి, న్యూస్‌టుడే:** వ్యాధి తగ్గడం లేదని మనోవేదనతో వృద్ధుడు బలవన్మరణం చెందిన సంఘటన రామన్నపేటలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై పృథ్వీధర్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన శంకరయ్య(65)కు భార్య లక్ష్మి, ఇద్దరు కొడుకులు ఉన్నారు. శంకరయ్య పదేళ్లుగా కుష్ఠు వ్యాధితో బాధపడుతున్నాడు. ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నా తగ్గకపోవడంతో మనోవేదనకు గురై ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొడుకు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## తల్లీకొడుకులపై అదనపు కట్నం కేసు నమోదు

**ఎల్లారెడ్డిపేట, న్యూస్‌టుడే:** అదనపు వరకట్నం కోసం ఇల్లాలిని వేధించిన సంఘటనలో ఎల్లారెడ్డిపేటకు చెందిన మొగుళ్ల శ్రీనివాస్, అతని తల్లి మొగుళ్ల లింగవ్వలపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఆయన కథనం మేరకు... ఎల్లారెడ్డిపేటకు చెందిన లలితకు, అదే గ్రామానికి చెందిన శ్రీనివాస్‌తో 2005లో వివాహమైంది. నగదు, బంగారం తదితర లాంఛనాలు ఇచ్చారు. వారికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కొంత కాలంగా అదనపు వరకట్నం కోసం వేధింపులకు గురిచేయడంతో పెద్దలు పలుమార్లు పంచాయితీ నిర్వహించారు. అయినా మార్పు రాలేదు. లలిత పేరిట ఉన్న 1.20 ఎకరాల భూమిని తన పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని, లేదంటే పుట్టింటి నుంచి రూ. 2 లక్షలను అదనంగా తీసుకురావాలంటూ మానసికంగా, శారీరకంగా వేధింపులకు గురిచేస్తున్నారు. ఈ క్రమంలో ఈ నెల 9న లలితను శ్రీనివాస్ తీవ్రంగా కొట్టాడు. దీంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు శ్రీనివాస్, అతని తల్లి లింగవ్వలపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రమాకాంత్ పేర్కొన్నారు.

## కారు, ద్విచక్రవాహనం ఢీకొని ఇద్దరికి గాయాలు

**ఒకరి పరిస్థితి విషమం, ఆసుపత్రికి తరలింపు**

**వెంకటాపూర్(ఎల్లారెడ్డిపేట), న్యూస్‌టుడే:** ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో మంగళవారం సాయంత్రం కారు, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో బండలింగంపల్లికి చెందిన కొత్తపల్లి బాబు, కొత్తపల్లి వెంకటేశ్‌లు గాయపడ్డారు. క్షతగాత్రులను 108 వాహనంలో సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కొత్తపల్లి బాబు, వెంకటేశ్‌లు ద్విచక్రవాహనంపై సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట వైపు వస్తుండగా, కామారెడ్డి నుంచి కరీంనగర్ వైపు వెళుతున్న కారు ఢీకొట్టినట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో ద్విచక్రవాహనం పూర్తిగా ధ్వంసమవగా, కారు ముందు భాగం దెబ్బతింది. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, విచారణ చేపట్టారు.


ప్రమాద స్థలంలో కారు, ద్విచక్రవాహనం

## టీకొట్టు డబ్బాలో చోరీ

**ముస్తాబాద్, న్యూస్‌టుడే:** మండలంలోని నామాపూర్ అడ్డరోడ్డు వద్ద టీకొట్టు డబ్బాలో చోరీ జరిగిన సంఘటన మంగళవారం వెలుగుచూసింది. బాధితుడు లచారి లింగం తెలిపిన వివరాల మేరకు... సోమవారం రాత్రి టీకొట్టు డబ్బాకు తాళం వేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి తాళం తీసిచూసేసరికి వెనకాల నుంచి డబ్బా రేకు కట్ చేసి లోపలికి ప్రవేశించి రూ.1000లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ ఘటనపై ఎస్సై గణేశ్‌ను వివరణ కోరగా బాధితుడు ఫిర్యాదు చేయలేదని తెలిపారు.

# కల్యాణం... కమనీయం

ఆధ్యాత్మికం

**గంభీరావుపేట, న్యూస్‌టుడే:** మండలంలోని హరిహర దేవాలయంలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి వేదపండితులు వేంకటేశ్వరస్వామి, అలివేలుమంగ, పద్మావతిల కల్యాణ మహోత్సవం కనుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ నెల 17న గరుడసేవ, 18న రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.


గంభీరావుపేట: కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

### శివకేశవుల ఆలయంలో ప్రత్యేక పూజలు

**ముస్తాబాద్:** ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ముస్తాబాద్ మండల కేంద్రంలోని శివకేశవుల ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. హోమంతో పాటు పలు ప్రత్యేక పూజలను హరీశ్ శర్మ, పార్థసారథి నిర్వహించారు. ఈనెల 16న శ్రీపద్మావతి- వేంకటేశ్వరస్వామి, పార్వతి-పరమేశ్వరుల కల్యాణం, 17న రథోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ ఎల్సాని దేవయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.


ముస్తాబాద్ శోభాయాత్రలో యువకులు

### ఘనంగా దుర్గామాత నిమజ్జన వేడుకలు

**ముస్తాబాద్:** దుర్గామాత శోభాయాత్ర ముస్తాబాద్ మండల కేంద్రంలో ఆట, పాటల మధ్య మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో మండపాలకు చేరుకొని పూజల్లో పాల్గొన్నారు. తరవాత దుర్గామాత శోభాయాత్ర యూత్ సభ్యుల ఆట, పాటల మధ్య సాగింది. అనంతరం పెద్దచెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.